# ఆశ్లేష

ఆమెను చూడగానే ఆనందాశ్చర్యాలలో మునకలు వేశాడు పార్వతీశం.

తను కోరుకున్న రూపలావణ్యాలు ఆమెలో నిండుగ ఉండటంతో తన తపస్సు ఫలించిందనిపించిందాతనకి.

మరల మరల చూశాడు. వెన్నెల కుప్పలా ఉందామె. మెరుపు చూపులు, పగడాల వన్నె అధరకాంతులు, అతనిని సమ్మోహితుడ్ని చేశాయి. సన్నజాజి పూవులా నడిచి వచ్చి తివాచీ మీద కూర్చుంది. ఆమె నడిచి వస్తూంటే పాదాల మీద చీర కుచ్చిళ్ళు పొరాడుతూంటే కవులు పాదపద్మాలని వేనినంటారో అర్థమైంది పార్వతీశానికి.

అందరి చూపూలూ తన మీదే. తన చూపులు మాత్రం వెన్నెల వెల్లువ మీద. ఆమె పేరేమైయుంటుంది? "వెన్నెలా?" తదేకంగా చూస్తే ఎవరేమను కుంటారో అని సంశయిస్తూనే దొంగ చూపులు చూశాడామెని.

"నీ పేరేమిటమ్మా?" ఎవరడిగారో గుర్తులేదు. కాని ఆమె కోయిల కంఠం విప్పి సమాధానం చెప్పేసరికి ఆశ్చర్య సంభ్రమాలలో మునిగిపోయాడు పార్వతీశం.

ఆమె తన కోసమే పుట్టిందని రూఢి అయింది.

ఆమె పేరు పార్వతి. మరి తను పార్వతీశం. ఆమె తనది కాక మరెవరి దవుతుంది? ఇంక ఎవరేమి మాటాడుకుంటున్నారో పట్టించుకోలేదు పార్వతీశం. ఆమె కోల ముఖాన్ని, సిగ్గుతో వాలిన అందమైన కను రెప్పల్ని, ధనువుల్లా వంగిన అందమైన కనుబొమలని, అందమైన సన్నని చేతివ్రేళ్లని చూస్తూ తన్మయుడై కాలం గడి పేశాడు. ఆమె ఒక్కసారిలేచి తళుకు చూపుల్ని విసరి, చీకటిని ముప్పేటలుగా ధరించిన పొడవైన జడగా సవరించి గదినిండా చీకటిని నింపి ఆమె వెనుదిరిగి పోతూంటే పార్వతీశం అనుకున్నాడు పార్వతిని తప్ప మరెవర్నీ పెళ్ళి చేసికోకూడదని. ఇంటికి వెళ్లగానే తల్లితో చెప్పాడు "అమ్మాయి నచ్చింది. ఇక మీ యిష్టం. సెలవు పెట్టుకుని మీరెప్పుడు రమ్మన్నా వస్తాను" అని.

రాత్రంతా అతని కలల్లో పార్వతి.

"పెళ్ళి కూతురెలా ఉందే?" అడిగాడామర్నాడు చిన్న చెల్లి శాంతని.

"బడాయి నన్నడుగుతావేరా? చేసికునేది నీవుగా". అంది.

"నిజమే ననుకో. కాని నీ అభిప్రాయం గురించి నేననేది?"

"నా అభిప్రాయానికేముందిరా? నాకు నచ్చింది. నేను మాటాడానుకదా. బి.ఏ. పాసయినా గర్వంలేదు. అందగత్తెనన్న గర్వం అసలు లేదు. పైగా అన్నాదీ 'నేను మీ అన్నయ్యకు నచ్చుతానా?' అని. ఆ అమ్మాయిని చూడగానే వదిన ముఖం మాడిపోయిందనుక్కో".

"అదేం?"

"తానే మహా అందగత్తెని కదా అని ఆవిడ మహాగర్వం. పౌడర్లు, లిప్‌స్టిక్కు రాస్తే ఆ అందం ఎవరికైనా వస్తుంది. అప్పుడా అమ్మాయిని చూడగానే గాలిపోయిన బెలూనులా అయింది ఆవిడగారి ముఖం. ఆ అమ్మాయి పక్కన చేరి తలలో కనకాంబర పూలదండను పెడుతూ నిజమైన జడ అవునో కాదో అని పట్టి లాగింది. నీవు చూడలే? ఆ అమ్మాయి మేకప్ లేకుండా ఎంత సింపుల్‌గా ఉందో! ఆ అమ్మాయి సిగ్గు పడి ముఖం వాల్చేసికునేసరికి బుగ్గలు ఒకసారి ఎర్రబడ్డాయి. నాకెంత ముద్దేసిందో? నిజంగా నేనేగాని మగాడినయ్యుంటే ఆ అమ్మాయిని పెళ్ళాడే సేద్దును" అంది శాంత.

గర్వంగా ఊపిరి తీసికున్నాడు పార్వతీశం.

"సెలవులేదు. రేపే వెళ్లిపోతాను నాన్న!" అన్నాడు తండ్రితో.

"అలాగే లే!" అన్నాడు గాని అమ్మాయి నచ్చిందాని అడగలేదు. అడుగుతా డేమోనని కొద్దిసేపు చూచి అక్కడనుండి వచ్చేశాడు.

మధ్యాహ్నం నిద్రలేచి బాత్‌రూములోకి వెళ్లబోతూ, "అందాన్ని కొరుక్కు తింటామా?" అని తల్లి వంటింటిలో ఎవరితోనో అనటం విన్నాడు. మనసెందుకో కలత పడింది. 'తనకు తెలియకుండానే తన మీదేదైనాకుట్ర జరుగుతోందా?' - అనుమానమొచ్చింది పార్వతీశానికి. ఎవరినడిగితే ఎవరు చేస్తారు? అన్నయ్య అసలు పట్టించుకోడు. నాన్ననడిగే ధైర్యం లేదు. అమ్మదంతా డొంక తిరుగుడు వాటం. వదినకు తనకుపడదు. శాంతకేమి తెలియనివ్వరు. ఇక మిగిలింది పెద్ద చెల్లాయి నిర్మల.

జడ వేసికుంటున్న నిర్మల దగ్గరికి నెమ్మదిగా వెళ్లి "ఏవిటే అంత తీరిగ్గా జడ వేసికుంటున్నావు?" అన్నాడు. సంభాషణని ఏదోలా ప్రారంభించాలికదాని.

"తీరిగ్గా కాకపోతే ఎలారా నాయనా? నీక్కాబోయే శ్రీమతి దయితే పెద్ద జడే. ఎలా అల్లుకున్నా బాధలేదు. నా జడ అలాకాదుగా. ఉన్న నాలుగు వెంట్రుకల్నే అందంగా కనిపించేటట్టు వేసికోవాలి. అద్సరే! ఏమిటి! ఎప్పుడూ లేనిదీ ఈ రోజు ఇంత తీరుబడిగా దయచేశావు?" అంది గుచ్చిగుచ్చి చూస్తూ నిర్మల.

"రేపెలాగూ వెళ్లిపోతానుకదాని..."

"అయితే ఏవిటట?"

"మరేం లేదు! పెళ్ళికూతురు గురించి ఇంట్లో ఏమనుకుంటున్నారో అడుగుదా మని..."

"అడిగేదేముంది మా ముగ్గురి అక్కాచెల్లెళ్ళకి వేయినూట పదహార్లు ఆడబడుచు లాంఛనాలుగా ఇప్పించావంటే నీ పెళ్లినే ఖాయంచేయిస్తాను" అంది.

"ఒక్కొక్కరికి నెయ్యి నూట పదహార్లా!"

"కాకపోతే ముగ్గురికి కలిపి అని అనుకున్నావా అయినా అప్పుడే కాబోయే మావగారి మీద అంత దయేమిట్రా నాయనా?"

"దయా దాక్షిణ్యాల మీదే పెళ్ళిళ్ళు అవటం జరిగితే ఆ దయా దాక్షిణ్యాలు ఎవరికో ఒకరికి ఉండాలికదే!"

"అన్నయ్యా! నే చెప్పేది విను. నాన్న గారు పాతిక వేలు అడుగుతున్నారు. వాళ్ళు పదికన్నా ఎక్కువ ఇవ్వలేమన్నారట. లాంఛనాల మాట వాళ్ళసలే ఎత్తలేదు. వాళ్ళు కనీసం 20 వేలయిన ఇచ్చి అత్తగారి ఆడబడుచు లాంఛనాలు యిస్తేనే తప్ప ఈ పెళ్ళి కాదురా. నీ దగ్గర దాపరికమెందుకు? అదీ సంగతి"

"అయితే అమ్మాయి నాకు నచ్చటంతో సంబంధం ఏమీ లేదా?"

"నచ్చింది కాబట్టే ఇన్ని మాటలూనూ. లేకపోతే సమస్యే లేదు"

"అయితే ఎవర్ని ఒప్పిస్తే ఈ పెళ్ళి అవుతుందే?"

"అడిగావుకదా. విను. నాన్నగారికి కట్నం తెచ్చే పిల్లకావాలి. అమ్మకి చేయికడిగి అన్నం నోట్లో పెట్టే కోడలు కావాలి. వదినకు తనకన్నా అందగత్తె కాని అమ్మాయి కావాలి. పెళ్ళయ్యే వరకేగా నీవు మా వాడివి. తరువాత నీవు మా ముఖాలు చూస్తావా? అందుకని మా లాంఛనాలు మాకు కావాలి. ఇక నీకంటావా? స్కూటరే కోరుకుంటావో, కలర్ టి.వి.యే కోరుకుంటావో నీ యిష్టం!"

"అడదాని వైయ్యుండి. తోటి ఆడపిల్ల మీద అంత కక్షతో ఎలా మాటాడ గలుగుతున్నావే?"

"కక్ష ఏముంది ఇందులో? వాళ్ళు ఇరవై వేలయినా యిస్తే ఓ పదివేలయినా మిగిల్చి కొంత కలిపి నా పెళ్లి చెయ్యాలని నాన్న ఆశ. లేకపోతే రిటైరయిన నాన్న నా పెళ్లి ఎలా చేయగలరు? నా స్వార్థం నాకుండదూ?"

"నేను అన్నయ్య మా పెళ్ళిళ్ళు చేయమా?"

"ఆహాహా! ఏమి మాటలు రా ఇవి? అమ్మాయి గడపలో కాలు పెట్టేంత వరకేరా ఈ మాటలు. తరువాత నీవు ఆమె మాట దాటి వస్తావా? ఆమె అడుగు దాటి నడుస్తావా? నీ తోటి బ్యాంకు ఉద్యోగే శ్రీధర్. అతనికి ముప్పయి వేలు కట్నం, లాంఛనాలు, స్కూటరు, కలర్ టి.వి. ఇవ్వలే అత్తవారు. అమ్మాయి ఒంటినిండా బంగారం. పైగా చదువుకుంది. కాన్వెంటులో పనిచేసి జీతం తెచ్చి అత్తగారి చేతిలో పోస్తోంది. మరి నీకు ఇరవైపాటి ఇవ్వరా? నీవు శ్రీధర్ కన్నా తీసిపోయావా? ఇక అందమంటావా? ఇద్దరు పిల్లలు పుట్టేంత వరకే ఈ అందం. తరువాత మొగుడి కైనా పెళ్ళానికైనా అందాల మీద ధ్యాసలుండవు. ఐశ్వర్యం సంపాదన - లగ్జరీ బతుకు. భర్త రెండు చేతులా సంపాదించి పోస్తేనే తప్ప భార్య భర్తకు శాంతినివ్వదు. భర్త తనకు తగ్గట్టు తన అవసరాలు సరిచూస్తూ సంపాదించి పోస్తేనే తప్ప భార్యని బతకనివ్వడు. చివరికి ఇద్దరి ధ్యాసా సంపాదనే. ఇక అందం - అప్యాయతా, ఆనందం, ప్రేమ, పలవరింతలూ ఎక్కడున్నాయి? డబ్బుతోటే లోకం. సరా! ఇక వెళ్ళి నీ నిర్ణయం నీవు చేసికో" అంది నిర్మల. పార్వతీశం అక్కడ నుండి కదలలేదు.

"నీ పెళ్ళి కట్నం కోసం నీ వింతగా పట్టు పట్టటం న్యాయంగా లేదు.అన్నయ్య పూనుకోకపోయినా నీ పెళ్ళి బాధ్యత నాది. నీ పెళ్ళికి ఈ కట్నానికి ముడిపెట్టకు దయచేసి" అన్నాడు పార్వతీశం.

"నేను ఉన్నది ఉన్నట్టుగా దాపరికం లేకండా మాటాడినందుకే కదా నీవిలా అంటున్నది? నిజానికి నాకే లాంఛనాలూ అక్కరలేదు. అసలు కట్నం యిచ్చి పెళ్ళి చేసికునే ఉద్దేశ్యమే నాకు లేదు. కాని... కట్నాలు లేకండా పెళ్ళిళ్ళు కావనే ఈ రోజుల్లో, కట్నం తీసికోకుండా పెళ్ళాడే, పెళ్ళి కొడుకు కోసం ఎంత కాలమని ఎదురు చూడమంటావు? ఏళ్ళు మీరిన బ్రహ్మచారిని పైకి ఎవరూ ఏమీ అనరు. కాని ఆడపిల్లల విషయం అలాకాదుకదా. ఆలోచించు. పెళ్లే జీవిత ధ్యేయమా? అని నీవనవు. ఎందుకంటే మనం దానిగురించే మాటాడుకుంటున్నాం కాబట్టి" అంది నిర్మల చిక్కు తీసికున్న జడకు రబ్బరు బాండ్‌ను బిగిస్తూ. పార్వతీశం మరేమీ మాటాడలేదు.

ఆ మర్నాడే మెయిల్‌కి హౌరా బయలు దేరాడు.

బయలు దేరేముందు "వెళ్ళొస్తా నాన్న!" అన్నాడు.

"అలాగే రా! వాళ్ళింకా ఏ కబురూ చేయలేదు. నేనే నీకు రాస్తాలే. క్షేమంగా వెళ్ళు. ఉత్తరం రాయి" అన్నాడాయన పేపరులో తలదూర్చుతూ.

పార్వతిని చూడకండా వెళ్ళాలనిపించలేదు పార్వతీశానికి. స్టేషనుకు వెళ్ళే దారిలోనే వాళ్ళిల్లు కాబట్టి ఆటోను వాళ్ళింటి ముందాపించాడు. వీధి వరండాలో ఆమె తండ్రే ఎదురొచ్చాడు.

"మంచిది బాబు! క్షేమంగా వెళ్ళి లాభంగా రా! అన్నాడాయన.

"వీధిలో నిలబెట్టి మాటాడతారేమండీ.? లోపలికి పిలవండి" అందామె తల్లి గడప దగ్గర నిల్చుని.

"లేదండీ! టైము లేదు వస్తాను". అన్నాడు. అన్నాడే కాని పార్వతిని చూడకుండా వెళ్ళిపోవలసి వస్తుందేమో అని భయపడుతూ నిలబడి పోయాడు.

"ఫరవాలేదు. ఆటోలో ఎంతసేపు" అంటూ లోపలికి తీసికెళ్లాడు అతడు. పార్వతీశం సోఫాలో కూర్చుంటూ పార్వతికోసం చూశాడు. పార్వతి కనిపించలేదు. ఆమె తల్లి కాఫీ కప్పు తెచ్చి అందిస్తూ "ఆరోగ్యం జాగ్రత్త బాబు. ఇక్కడ కన్నా అక్కడ చలి ఎక్కువ" అంది.

ఆలశ్యం చేస్తూనే కాఫీ త్రాగాడు. అయినా పార్వతి కనిపించ లేదు. మరి కొద్ది సేపుంటే కనిపించేదేమో! కూర్చోనీయ కుండా ఆటోవాడు వీధిలోంచి తొందర చేయడం మొదలు పెట్టాడు. ఇక తప్పదన్నట్టు లేచాడు. అయిష్టంగానే ఆటోలో కాలు పెట్టాడు. ఆశ తీరక తలెత్తి చూశాడు. కిటికీ తెర తొలగింది. కిటికీ చువ్వల పట్టుకున్న తామర తూళ్ళు. వెన్నెలను కుమ్మరించే అమృత గనులు, పండిన దొండ పండు, తుమ్మెదరెక్కలు, సంపంగెపూవు కనిపించాయి. పార్వతీశం మనసు దూదిపింజె అయింది. ఆటోవాడికి అడిగిన దాని కన్నా ఓ రూపాయి ఎక్కువే యిచ్చాడు.

పార్వతీశం కలకత్తా చేరిన నెల రోజులకి తండ్రి ఉత్తరం రాసాడు. "జాతకాలు పడలేదు. ఇక్కడే మరో సంబంధం ఉంది. ముందుగానే జాతకాలు చూపించాము. అన్నీ సరిపోయాయి. మేము కూడా అమ్మాయిని చూశాం. అమ్మాయి బాగుంది. మాకందరికీ నచ్చింది. అమ్మాయి తప్పక నీకు నచ్చుతుంది. కాబట్టి నీవు సెలవు పెట్టుకొని రా!" అని.

ఉత్తరంలో విషయాలేవీ అతనికి ఆనందాన్నివ్వలేక పోయాయి.

"నేనిక ఏ పిల్లనూ చూడను. పార్వతిని తప్ప మరెవరినీ చేసికోను". అని ఉత్తరం రాసేద్దామనుకున్నాడు. 'కాని ఉత్తరాలు వల్ల కుదిరే వ్యవహారం కాదిది' అనిపించింది. వెంటనే మెయిల్ ఎక్కాడు.

ఇంటిలో అడుగు పెడుతూనే తల్లినడిగాడు.

"జాతకాలు పడలేదని నాన్న రాసారు. అసలేమిటో వివరంగా చెప్పమ్మా!" అని.

"చెప్పేదేముంది నాయనా! అమ్మాయిది ఆశ్లేష నక్షత్రం".

"అంటే!"

"ఏముంది? అత్తగారి గండం. అమ్మాయి ఈ ఇంటిలో అడుగు పెట్టిన సంవత్సరం లోగానే 'హరీ' అంటాను. అంతే!"

"అయితే ఈ సంగతి తెలిసే పెళ్ళి చూపులకు రమ్మన్నారా అమ్మా?"

"వాళ్ళకెందుకు తెలియదూ? మనకి మాత్రం తప్పుడు జాతకం యిచ్చారు. కాని నిజం ఎంత కాలం దాగుతుంది?"

"అయితే నిజం ఎలా తెలిసిందమ్మా!"

"ఒకప్పుడు వీళ్ళ పొరుగు వాళ్ళే చెప్పారు".

"వాళ్ళెవరో చెప్తావమ్మా! వెళ్ళి కలుస్తాను".

"కలియక్కర లేదు. కనుక్కోనక్కర లేదు. నీకు ఆ అమ్మాయి మీద మనసు ఉంది. ఆ అమ్మాయినే పెళ్ళి చేసేసికో. మాతో నీకు సంబంధం ఏమిటి? ఈ అమ్మ ఉన్నా ఊడినా నీ కనవసరం. అమ్మ మనసు అమృతం. కొడుకు మనసు కాలకూటం. ఇల్లు కదలి కాలు వీధిలో పెట్టడానికే వారం, వర్జ్యం, రాహుకాలం, దుర్ముహూర్తం - ఇన్ని చూస్తున్నామే. పది కాలాలపాటు ఉండాల్సినది మీరు. మీ మంచీ చెడు చూచే అవసరం మాకు లేదూ? మేము ఇవాళుంటాము. రేపు పోతాం. పది కాలాలు చల్లగా ఉండాల్సినది మీరు. ఇక నే చెప్పేదేమి లేదు. నీ ఇష్టం ఎలా ఉంటే అలా చెయ్యి" అంటూ తన పాఠం వల్లించేసిందామె కోపంగా.

తల్లికి అంతగా కోపం ఎందుకు వచ్చిందో అర్థంకాలేదతనికి. పార్వతిలో అవలక్షణాలుంటాయని, ఆమె తన ఇంటిలో అడుగు పెట్టగానే తల్లి మెడకు యమపాశం తగిలిస్తుందని నమ్మశక్యం కాలేదు పార్వతీశానికి. పార్వతి అందమే తనకు మంచి అభిప్రాయం కలిగిస్తోందని అనుకోడానికే అతనికి మనసు కాలేదు.

"రేపు మంచిది పిల్లని చూడడానికి వెల్దాం" అన్నాడు తండ్రి ఆ సాయంత్రం. "అసలు ముందుగా వీళ్ళను కలసి మనకు తప్పుడు జాతకం ఎందుకు యిచ్చారో కనుక్కుంటాను" అన్నాడు షూ లేసులు బిగించుకుంటూ.

కొడుకు తలఎత్తే వరకు ఆగి "వాళ్ళేం చెప్తారు రా! మే మిచ్చినదే సరియైన దంటారు. నీ వంటావు వాళ్ళెవరో చెప్పారని. అనవసరంగా మనకుపకారం చేసిన పెద్ద మనిషిని వీధిలోకి లాగినట్టవుతుంది. మనం జాతకాలు పడలేదని వాళ్ళకి చెప్పలేదు. మా అబ్బాయి ఇప్పుడల్లా పెళ్ళి చేసికోడని చెప్పాం. మనకీ సంబంధం యిష్టం లేదని వాళ్ళకి అర్థమవుతుంది. 'అమ్మాయి నక్షత్రం ఆశ్లేషట అని మనమంటే నలుగుర్లో పాకి అమ్మాయికి పెళ్ళవటమే కష్టం. మనకెందుకా పాపం!" అన్నాడాయన.

"ఇంతకీ నా నక్షత్రం మంచిదా నాన్న".

"నీ నక్షత్రానికేమిరా! దివ్యమైన నక్షత్రం. మంచి గ్రహరాశి. ఒక సంవత్సరంలోగా నీకు పెళ్ళవుతుంది".

పార్వతీశం మరేమీ మాటాడకుండా వీధిలోకి అడుగు పెట్టాడు పార్వతీశానికి అంతా అగమ్యగోచరంగా ఉంది. నిర్మల సైతం ఏమీ చెప్పటం లేదు. నిజంగా జాతకాలు పడకపోవటమే అసలైన కారణమా? నిజంగా జాతకాలు మన జీవితాన్ని శాసిస్తాయా? మనిషి మనుగడకి ఈ శాస్త్రం ఎంత వరకు ఉపయోగిస్తుంది? - పార్వతీశానికేమి అర్థం కాలేదు. 'కట్నాలు సరిపడక ఆడుతున్న నాటకమా? అదే నిజమైతే దానిని తానెలా ఎదుర్కోవాలి?" - ప్రశ్నించుకున్నాడు పార్వతీశం. ఆలోచించుకుంటూ నడుచుకుంటూనే అప్రయత్నంగా ఆ డాబా ఇంటి ముందు ఆగిపోయాడు. ఇంటి ముందు గదిలో దీపం వెలగటం లేదు. వెళ్ళి ఏం మాటాడాలో బాగా చర్చించుకున్నాడు. నెమ్మదిగా గేటు తెరచుకుని లోపలికి అడుగు పెట్టాడు. వెన్నెల అంతటా పరిమళాలు వెదజల్లుతోంది. మెట్లెక్కి వరండాలో నిలబడ్డాడు. గేటు చప్పుడికి ఎవరో వస్తున్న అలికిడి. వరండాలో దీపం వెలిగింది. తెర తొలగించి వస్తున్న ఆమెను చూచి చకితుడయ్యాడు. ఆమె కూడ ఒక అడుగు ముందు కేయబోయి నిలబడి పోయింది.

"నాన్నగారు లేరాండి?"

"లే... లేరండి. అమ్మ నాన్న శంకర మఠాని కెళ్ళారు".

"మరి...."

"తమ్ముడు సినిమాకి చెల్లాయి టైపుకి. నాన్నగారు ఉదయం ఉంటారు రండి".

వెను దిరగ బోయిందామె.

"ఆగండీ. నిజానికి నేను మీ నాన్నగారితోనే మాటాడాలని వచ్చాను. కాని ఆయన లేక పోయినా నేను మీతోనైనా చెప్పవచ్చు. వినండి. మీ నాన్నగారితో కూడా చెప్పండి. నేను మిమ్మల్ని బాగ యిష్టపడుతున్నాను. మీరు ఇష్టపడితే నేను పెళ్ళి చేసికుంటాను. కాని నాకోసం మీరు ఓ రెండు సంవత్సరాలు ఆగవలసి ఉంటుంది.

ముందుగా మీ యిష్టం కూడ తెలిసి కోవాలిగా చెప్పండి దాపరికం లేకుండా. నేనంటే మీరు యిష్ట పడుతున్నారా?''

''ఇష్టాలు మగవాళ్ళకే గాని ఆడవాళ్ళకు కాదు కదండి. ఉన్నా చెల్లవు. మరి అనుక్కోవడం ఎందుకండి?''

''నేను నా ఇంటి పరిస్థితిని దృష్టిలో పెట్టుకునే ఆ వ్యవధి అడిగాను. మీ రిష్టపడితే మిమ్మల్నే చేసికుంటాను''.

ఆమె ఏదో ఆలోచిస్తూ నిలబడి పోయింది.

''నా కోసం ఆగలేరూ?''

ఆమె చటుక్కున తలెత్తి 'రేపు మా నాన్నగారితో చెప్పండి''. అంది.

ఆమె అంతకన్నా ఇంకేమీ చెప్పలేదని తెలిసి ''వస్తాను'' అని వెనుతిరిగాడు.

''ఎక్కడి కెళ్ళావురా?'' అని తల్లి. ''వాళ్ళింటికే వెళ్ళావా?'' అని తండ్రి అడగ లేదు. ఆ రాత్రి ముభావంగానే ఉన్నాడు పార్వతీశం.

మర్నాటి ఉదయం వెళ్ళే సరికి అతను ఇంటిలోనే ఉన్నాడు.

''నిన్న సాయంత్రం వచ్చాను.''

''అవును అమ్మాయి చెప్పింది.''

''నా మాటలు కూడా....''

''చెప్పింది. కాని మగ పిల్ల వాడివి నీవు. నీకున్న నిదానం మాకుండదు బాబూ. మా ఒంట్లో జవసత్వాలున్నప్పుడే నాలుగు శుభకార్యాలూ చేసికోవాలని మాకుంటుంది. నీవు మరి ఆలస్యం చేసికోకుండా ఓ మంచి అమ్మాయిని చూచి పెళ్ళి చేసికో బాబూ.''

''మరి మీ అమ్మాయి...!''

''దానికీ మంచి సంబంధం చూసి పెళ్ళి చేసేస్తాను. దీని తరువాత పిల్లకి మేనరికం సిద్ధంగా ఉంది. వాళ్ళూ తొందర పడుతున్నారు. కుదిరితే ఈ ఫిబ్రవరి - మార్చిలోనే ఇద్దరికీ చేసేస్తాను''.

''నేను మీ అమ్మాయిని చేసికుంటాను''.

''అది ఇప్పుడు కాదుగా. మబ్బుల్లో నీళుంటాయని అందుబాటులోకి వచ్చిన నీళ్ళు పారబోసుకోముకదా. అయినా నీ కంత పట్టుదలగా ఉంటే మీ నాన్నగార్ని వచ్చి మాటాడమను'' అన్నాడాయన. అంతలో ఆయన భార్య కాఫీ తెచ్చి ఇద్దరికీ ఇచ్చి పలకరించ నైనా పలకరించకుండా ఇంటిలోకి వెళ్ళిపోయింది. పార్వతీశం మనసు చివుక్కుమంది. కాఫీ రుచించ లేదు.

''నిన్న రాత్రంతా అమ్మాయి బాధ పడింది 'కనీసం కూర్చోమన్నాను కాదు. దురుసుగా మాటాడాను'. అని''

"ఆమె అన్నదానిలో తప్పేముంది? ఎవరి యిష్టాలైనా సాగని వ్యవస్థలో మనం ఉన్నాం. ఇష్టాన్నైనా పైకి చెప్పుకోలేని అసమర్థులం మనం. మన సమస్యను ఎవరో పరిష్కరించ లేరు. మనమే పరిష్కరించుకోవాలి. మానాన్న వచ్చి మాటాడతారని నే ననుక్కోను. నాకు రెండేళ్ళు వ్యవధి ఇవ్వండి. మీ అమ్మాయిని నేను చేసికొంటాను. అదైనా ఆమె నన్ను ఇష్టపడితేనే"

"అదేం మాట బాబూ! నిన్ను యిష్టపడని దెవరు? నిన్ను దక్కించు కోలేకపోతున్నామనే మాకు బాధగా ఉంది".

గుండెలోంచి దు:ఖం తన్నుకొచ్చింది. మరక్కడ ఉండ లేక ఇంటికి వచ్చేశాడు పార్వతీశం.

ఇంటిలో అడుగు పెడుతూనే తల్లీ తండ్రిని - ఇద్దర్ని పిలిచి చెప్పాడు "ఈ రాబోయే ఫిబ్రవరి కల్లా నిర్మల పెళ్ళి ఖాయం చెయ్యండి. కట్నం ఎంతయినా పెళ్ళి నే చేస్తాను. ఇక రెండో మాట నిర్మల పెళ్ళి తరువాత పార్వతిని నేను పెళ్ళి చేసికుంటాను. నన్నెవరూ ఆపలేరు". అంటూ మారు మాటకు తావివ్వకండా అక్కడ నుండి కదలిపోయాడు.

ఆ రాత్రే కోరమాండల్లో కలకత్తా బయలు దేరాడు.

కలకత్తా చేరిన వెంటనే 'లోను'కు అప్లయి చేసి 'లోను సంపాదించాడు. ఫైనాన్సర్ను దగ్గర అప్పు చేశాడు. తన ఖర్చుల్ని అదుపు చేసి కున్నాడు. అప్పులిచ్చే స్నేహితుల్ని సంపాదించుకుని హామీలు పొందాడు. ఎవరేమను కుంటారో అని ఆలోచించకుండా 'నేను మిమ్మల్ని పొందటానికి అడ్డంకు లన్నింటిని తొలగించు కుంటున్నాను. దయ చేసి నాకు వ్యవధి ఇవ్వండి" అని పార్వతికి ఉత్తరం రాసాడు. ఆ ఉత్తరం ఆమెకు అందించో లేదో తెలియదు. పార్వతీశానికి మాత్రం జవాబురాలేదు.

నిర్మల పెళ్ళి ఫిబ్రవరి లోనే జరిగింది. కాకపోతే ఓ రెండు సంవత్సరాల తరువాత. పార్వతి పెళ్ళి మార్చిలోనే జరిగి పోయింది. ఆ రెండు సంవత్సరాల గడువు తీరిన తరువాతనే. కాని పార్వతీశంతో మాత్రం కాదు. నిర్మల పెళ్ళి అయిన మూడు నెలలకే అతని తల్లిపోవటం అతని పెళ్ళి కాటంకం అయింది. అటు తరువాత శాంత పెళ్ళి, అటు తరువాత తండ్రి మరణంతో పార్వతీశం గురించి పట్టించుకునే వారే లేక పోయారు. పార్వతిని ఆమె అత్త ప్రేమగా చూసుకుంటుందని తండ్రి అంత్యక్రియలకు వెళ్ళినప్పుడు విన్నాడు. అంతే అతను కలకత్తా వదలి మరి రాలేదు.

పార్వతీశం కలకత్తాలో ఎవర్నో ఉంచు కున్నాడని అందరూ అంటారు.

ఉంచుకున్న మాట వాస్తవమే. కాని ఇంటిలో కాదు. మనసులో-అతి పదిలంగా.

* * *